ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 సంచిక : 4 డిసెంబర్ 2015

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

22-09-2015

జిన్నూరు

22-10-2015

జిన్నూరు

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-09-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బయట ఎక్కడా ఏమీ లేదు. మన హృదయం ఖాళీ అవ్వాలి, అది ముఖ్యం. హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికీ ఈశ్వర సాక్షాత్కారం కలుగదు. ఈ ప్రపంచంలో ఎక్కడ చూసినా అశాంతే, దీనికి ఎక్కువగా మనుషులే కారణం. మనలో పదిమందికి శాంతి లేకపోతే మన దగ్గరకు వచ్చేవాళ్ళందరికి శాంతి లేకుండా చేసేస్తాము. భారతదేశంలో ఉన్న సాహిత్యం అంతా ఎక్కువ భక్తుల వల్లనే వచ్చింది. మహాగ్రంథాలను వ్రాసిన కవులు అందరూ కూడా భక్తులే. భక్తులు లేకుంటే భగవంతుడు ఎక్కడ ఉన్నాడు. భక్తులు తుకారామ్, జ్ఞానేశ్వర్ వాళ్ళు ఉన్నారు కాబట్టే వారి ద్వారా భగవంతుడి వైభవం ఈ లోకానికి తెలిసింది. మీ మనస్సుకు శరణాగతి కనుక కుదిరితే అసలు ఏ మార్గం అక్కరలేదు. శరణాగతి సేఫెస్ట్ సైడ్. ఎసిలో కూర్చుని రైలు ప్రయాణం చేసినట్లు ఉంటుంది. శరణాగతి చేసాక ఇంక మనస్సు ఉండదు. శరణాగతి అంటే నేను లేను, నువ్వే ఉన్నావు అనే భావన రావాలి. నువ్వే ఉన్నావు, నేను లేను అనే భావన స్థిరపడినప్పుడు శరణాగతి పరిపూర్ణం అవుతుంది. అసలు శరణాగతిభావన మీకు కుదిరితే అలా కూడా నేను పోతుంది, ఇంక అప్పుడు మీకు నేను ఎవడను అనే విచారణ అక్కరలేదు అన్నారు భగవాన్. మీరు విశ్వాసపాత్రులు అయితే మీకు శరణాగతి మార్గం మంచిది. ఈశ్వరుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మీకు లేనప్పుడు నేను ఎవడను అనే జ్ఞానమార్గం మంచిది. మీ మానసిక స్థితినిబట్టి ఏ మార్గం మంచిదో మీరే చూసుకోవాలి. అనుకరణ మంచిదికాదు.

మనం ప్రయాణాలు చేసేటప్పుడు ఒకోసారి మనకు తెలియ

కుండానే మన జేబులో ఉన్న పర్సు పోతుంది. అలాగే ఈ దేహగతమైననేను కనబడకుండా పోయింది, అది పోవాలని నేను ఏమీ ప్రయత్నం చేయలేదు అన్నాడు తుకారామ్. పాండురంగడిపట్ల ఉన్న భక్తిలో, ఆ శరణాగతిభావనలో ఈయనకు తెలియకుండానే ఆ నేను రాలిపోయింది. వరల్డ్‌హిస్టరీలో ఒక్క తుకారామ్‌ను మాత్రమే హ్యూమన్‌బాడీతో వైకుంఠానికి తీసుకుని వెళ్ళారు అని చెపుతారు. శరణాగతిమార్గం ద్వారా కూడా భగవంతుడిలో ఐక్యం అవ్వవచ్చు. తుకారామ్ జీవితంలో అనేక అవమానాలు భరించాడు. వాడు పెళ్ళి చేసుకున్నాడు చాలా కష్టాలు పడ్డాడు. చిల్లరికొట్టు పెట్టుకొని నష్టపోయాడు. వీడు అమాయకుడిలా కనిపిస్తూ ఉంటే ఆ వూరిలో మారని డబ్బులు అన్నీ తెచ్చి ఈయనకు ఇచ్చేవారు, ఆయన తెలిసి పుచ్చుకునేవాడు. ఆయన జీవితంలో ఇవన్నీ బహుమతులుగా మారిపోయినాయి. ఇదంతా భగవంతుడు చూస్తూ ఉంటాడు కాని తీర్పులు చెప్పటం ఆలస్యం చేస్తాడు. అందుచేత మీకు కూడా సహనం ఉండాలి.

దేవుడు ఉన్నాడనికాని, లేడు అనికాని ఆ విషయాల గురించి బుద్ధుడు చెప్పలేదు. నీకు ఉన్న వాసనల గురించి చెప్పాడు. స్కేనింగ్ తీసి నీ దేహంలో ఉన్న అవయవాలు ఎలా పనిచేస్తున్నాయో చెపుతున్నారు కదా అలాగే నీ మనస్సును స్కేనింగ్ చెయ్యి. ఇతరుల గొడవ నీకు అనవసరం. మనస్సును స్కేనింగ్ తీసి అందులో ప్లస్‌పాయింట్స్ ఏమి ఉన్నాయి, మైనస్ పాయింట్స్ ఏమి ఉన్నాయి అనేది చూసుకో. కిరసనాయిల్ అవ్వగానే దీపం ఆరిపోతుంది, నువ్వు ఆర్పనక్కరలేదు. నీలోపల ఉన్న దేహవాసనలు, శాస్త్రవాసనలు, లోక వాసనలు ఇవన్నీ పూర్తిగా కాలిబూడిద అయిపోవాలి. అసలు భగవంతుడు ఉన్నాడా, లేడా అని కాదు. దానితో సంబంధం లేకుండా మీ శరీరానికి వచ్చిన రోగాలను మీరు ఎలా తగ్గించుకొంటున్నారో అలాగే మీ మనస్సులో ఉన్న బలహీనతలను సాధన చేసి తొలగించుకోవాలి. అది ముఖ్యం. ఏదో గుడికి వెళ్ళి నమస్కారం పెట్టుకొని వచ్చాము అదికాదు, లోపల మనల్ని దేహానికి, లోకానికి ఏ విషయాలు అయితే కట్టేస్తున్నాయో వాటిని కత్తిరించాలి. భూతద్దంతో నీ మనస్సును చూసుకోవాలి, జనరల్‌గా కాదు, చాలా క్లోజ్‌గా చూడాలి. అసలు మనుషులు అందరిలోను బలహీనత ఏమిటి అంటే మీరు మంచివాళ్ళు అని ఎవరైనా అంటే మనం అవును కాబోసు అనుకొంటాము. ఎదుటివాళ్ల కళ్ళతో మీరు చూసుకోవద్దు. మన కళ్ళతో మనల్ని చూసుకోవాలి. లోపలకు వెళ్ళి చూసుకోవాలి కాని ఎదుటివాళ్ళు మీరు చాలామంచివాళ్ళు అంటే మంచివాళ్ళు అనుకొని, మీరు మంచి వాళ్ళు కాదు అంటే మంచివాళ్ళు కాదు అనుకొని అలా ఎదుటివాళ్ళ కళ్ళతో మనల్ని మనం చూసుకోకూడదు. ముందు అది నేర్చుకోండి. ఈ బలహీనత అందరిలోను ఉంది. మీ అంచనా మీకు ఉండాలి. అలాగే ఆధ్యాత్మికంగా కూడా అసలు మీరు ఏ స్థాయిలో ఉన్నారో మీ అంచనా

మీకు ఉండాలి. అందుచేత ఎదుటివాళ్ళు చెప్పే మాటల మీద మనం ఆధారపడ కూడదు. అసలు మనం ఎలా ఉన్నామో అది చూసుకోవాలి.

భాగవతం చదివి ప్రహ్లాదుడిని అందరూ భక్తుడు అనుకొంటారు. శంకరాచార్యులు, రమణమహర్షిలను మించిన అద్వైతి ప్రహ్లాదుడు. వాడు సమస్థాన్ని ఒకటిగా చూసాడు. అద్వైతం అంటే రెండు లేనిది. మొత్తం సమస్తాన్ని ఒకటిగా చూసిన వాడు ప్రహ్లాదుడు, వాడు నిజమైన అద్వైతి. వాడిని భక్తుడు అనుకొంటున్నారు కాని అద్వైతి అని అనుకోవటం లేదు. ఏనుగులను మీదకు పంపినా, పాములచేత కరిపించినా, కొండలమీదనుండి దొర్లించినా అంతా నారాయణుడే, అంతా ఒకటిగానే చూసాడు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే కంగారుపడతారు. అలా కంగారుపడకూడదు. వాళ్ళు ఎందుకు విమర్శిస్తున్నారు అని ఎనాలసిస్ చేసుకోవాలి. అసూయ వలన విమర్శిస్తున్నారా లేక ఏదైనా కారణం ఉందా అని చూసుకోవాలి. అసలు నూటికి తొంభై విమర్శలు అసూయ వల్లే వస్తాయి. అసలు విమర్శించే వాళ్ళను మీరు పట్టించుకోవద్దు. వాళ్ళు మంచివాళ్ళు అయితే మీ ఇంటికి వచ్చి రైట్‌పాత్ ఇది అని మీకు చెపుతారు కాని విమర్శించరు. ఈ ప్రపంచంలోనికి మనం ఎందుకు వచ్చామో భగవాన్ చెప్పారు. మీ ముఖాన్ని అద్దంలో చూసుకొంటారు, ఎందుకు అంటే మీ ముఖం ఎలా ఉంది శుభ్రంగా ఉందా లేకపోతే ఏదైనా మసి ఉందా అని అద్దంలో చూసుకుంటారు. అలాగే ఈ ప్రపంచం ఒక అద్దంలాంటిది. నీ మనస్సులో ఉన్న కొన్ని విషయాలను చూపించవచ్చు. అందులో వాళ్ళు చెప్పేది న్యాయం ఉంటే అది సవరించుకో. వాళ్ళు చెప్పేది అసూయతో చెపుతూ ఉంటే దానిని వదిలెయ్యి. వాళ్ళు విమర్శించే దానిలో పాయింట్ ఉంటే ఆ మైనస్ పాయింట్‌ను తొలగించుకో. అదే నీ జీవిత లక్ష్యం అన్నారు భగవాన్. అంటే భగవంతుడు నీకు ఈ శరీరాన్ని ఎందుకు ఇచ్చాడు అంటే నువ్వు పవిత్రం అవ్వటానికి నీకో అవకాశం ఇచ్చాడు.

బహుజన్మలలో నువ్వు మంచిచేస్తూ, నీ మనస్సును బాగుచేసుకొంటూ రావాలి. నీ మనస్సు పవిత్రం అవ్వాలి. ఇలా బహుజన్మల కృషి వల్లకాని నీకు జ్ఞానం రాదు అని పరమాత్మ చెప్పాడు. ఇది భగవాన్‌తో చెపితే ఏంటయ్యా నువ్వు చెపుతున్నావు, ఒక జన్మలో రాదా. సత్యం అనేది ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. ఇప్పుడు కాకపోతే, ఇక్కడ రాకపోతే, ఎప్పుడో అది వస్తుంది అంటే అది నిజం కాదు. భగవంతుడు జనరల్‌గా చెప్పి ఉండవచ్చు. అది ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. నువ్వు తెలుసుకొన్నాక అది ఎక్కడ నుండో వస్తుంది అనుకుంటున్నావు. లేనిదానిని నువ్వు కనిపెట్టటంకాదు, ఉన్నదానిని గ్రహించటమే. నీ మనస్సుకు లోచూపు లేదు. బహిర్ముఖమవుతున్న మనస్సును అంతర్ముఖపరిచేవాడే గురువు. మనస్సును అంతర్ముఖపరిస్తేనేగాని హృదయంవైపుకు దానికి దారి కనబడదు. సత్యం అనేది

ఎప్పడూ ఉంది. దానికి ఒక కాలం లేదు, ఒక ప్రాంతం లేదు. అది అంతటా వ్యాపించి ఉంది. సత్యానుభవం పొందినవారికి ఇలా కళ్ళు మూసుకుని కళ్ళు తెరిస్తే వారాలు, నెలలు వెళ్ళిపోతాయి. మనకు ఒక గంట ఎవరూ కనబడకపోతే కాలక్షేపంకోసం ఎవరినో ఒకరిని వెతుక్కొంటాము, మరి టైమును చంపేయాలి కదా! చాలామందికి ఈ టైమ్‌కిల్లర్స్ అంటే ఇష్టం. వాళ్ళు మీ టైము అంతా తినేస్తున్నారని మీకు తెలియటంలేదు. మీకు ఫ్రెండ్స్ సర్కిల్ కూడా తగుమాత్రంగా ఉండాలి. ఎక్కువ అయితే మీ టైమును వాళ్ళు తినేస్తారు. మీకు బాగా సన్నిహితులు సడన్‌గా విరోధులు అయినా మీ మనస్సు అప్‌సెట్ అవ్వకూడదు. ఈ రోజు మనకు స్నేహితులుగా ఉన్నవారు రేపు విరోధులు అవ్వవచ్చు. ఆచార్యులవారు చెప్పినట్లు మన ముక్కులోగాలి బయటకుపోతే ఎవరికీ ఎవరూ ఏమీ కారు. మీకు వెయ్యి ఎకరాలు సంపాదించి ఇస్తే, వాళ్ళు మరణించిన తరువాత ఆ శరీరానికి నిప్పపెట్టి ఇంటికి వచ్చిన వెంటనే వాళ్ళని మర్చిపోతారు. ఎందుచేతనంటే మానవుడిలో కృతజ్ఞతాభావన చాలా తక్కువ. కాని పరమాత్మ మానవుడిలాంటి వాడుకాదు. గీతలో పరమాత్మ ఏమనిచెప్పాడు అంటే నువ్వు కొంచెం మంచిచేసినా, నువ్వు కర్తృత్వం లేకుండా భగవంతుడి పని కొంచెం చేసినా నేను నిన్ను విడిచిపెట్టను, ఆ పనిని వంపు పెట్టుకొని నేను నిన్ను రక్షిస్తాను అని చెప్పాడు.

భారతంలో ధర్మరాజు కృష్ణుడితో అంటాడు నిన్ను అందరూ దేవుడు అంటున్నారు, నారాయణుడు అంటున్నారు, నువ్వు అందరికీ ఆదర్శంగా ఉండాలి మరి ఈ అబద్దాలు ఏమిటి అని అడిగాడు. యుద్ధం మధ్యలో కొన్ని అబద్ధాలు చెప్పినమాట నిజమే. నా స్వార్థం కోసం ఏదైనా ఒక్క అబద్ధం చెప్పానా? అవి ఎవరికోసం చెప్పాను మీకోసం చెప్పాను. మీరు ధర్మాత్ములు, మంచివారు, మీకు కష్టాలు వచ్చినప్పడు నేను గాలికి వదిలేస్తే ఒక్క భీష్ముడు చాలు మిమ్మల్ని చంపటానికి. సరే ఒక్క అబద్ధం చెప్పను, నా కళ్ళ ఎదురుగా మీరందరూ చనిపోతారు. కృష్ణుడు సత్యవ్రతుడు, గొప్పవాడు అని నాకు పేరు రావచ్చు. ఆ పేరు నెత్తిమీద వేసుకొని తిరగమంటావా? మీరు చనిపోయాక నాకు ఈ పేరు ఎందుకు? ఈ గౌరవాలు ఎందుకు? భగవంతుడికి గౌరవం, అగౌరవం ఏమిటి? మనం ఇంపెర్సనల్‌గా జీవించటం నేర్చుకోవాలి, అది ముఖ్యం. మీ పనులు మీరు చేసుకోండి. మీరు ఏదైనా పని చేసి ఆ పని వలన మనకు గౌరవం రావాలి, గుర్తింపులు రావాలి అనుకొంటే ఆ రోజుకారోజు మీ స్వరూపానికి దూరమైపోతారు. ఇప్పడు రోజులు ఎలా ఉన్నాయి అంటే ఆ గోడమీద మీ పేరు వ్రాస్తాము అంటే పదిరూపాయలు ఇస్తున్నారు అంటే వాళ్ళు మంచిపని చేయటానికి ఇస్తున్నారా లేక పేరుకోసం, గొప్పలకోసం ఇస్తున్నారా? లోకం మీరు చేసే పనిచూస్తుంది, మీ మాట చూస్తుంది కాని భగవంతుడు మీరు చేసే పనిచూడడు, మాట చూడడు. ఆ పని చేసేటప్పడు మీ హృదయం ఎలా ఉంది? మీరు మాట్లాడేటప్పడు మీ హృదయంలో

ఎలా ఉన్నారు? అనేది భగవంతుడు చూస్తాడు. ఒక మనిషి గురించి అంచనా వేసేటప్పుడు ఎవరైనా సరే వాడికి ఎంత డబ్బు ఉంది, వాడికి ఏమైనా అధికారం ఉందా, వాడు ఏమైనా చదువుకొన్నాడా అలా ఎవ్వడినీ కొలవకూడదు. వాడు ఏ కులస్థుడు అయినా, ఏ మతస్థుడు అయినా వాడు హృదయంలో ఎలా ఉన్నాడు, అది ముఖ్యం. దానినిబట్టి ఆ మనిషిని అంచనా వేయండి. మా చుట్టాలు, మా స్నేహితులు ఈ గొడవ అనవసరం. ఇప్పుడు నువ్వు మాట్లాడుతున్నావు. పైకి అందంగానే మాట్లాడుతున్నావు, ఏమో నీ మనస్సులో ఏముందో?

మీరు నిరంతరం ఏది ఆలోచిస్తున్నారో అదే అవుతారు. మీకు రాత్రి నిద్ర రాకపోతే మీ ఇష్టదైవాన్ని అలా స్మరించుకొంటూ ఉంటే మీకు నిద్ర వచ్చేస్తుంది. మీరు అలా స్మరించుకొంటూ ఉంటే మనస్సు లోపలకు విత్‌డ్రా అవుతుంది. మనస్సు విత్‌డ్రా అయిన వెంటనే మీరు నిద్రలోనికి వెళ్ళిపోతారు. మీరు నిరంతరం భగవంతుడిని స్మరించటం వలన భగవంతుడిని పొందవచ్చు. స్మరణవలన కూడా భగవంతుడిని పొందవచ్చు, అది కూడా ఒక యోగమే. మా కుటుంబం, మా కుటుంబం అంటారు. అంటే శరీరాలను బట్టే కదా కుటుంబం. ఒకోసారి వాళ్ళు కూడా చాలా ప్రమాదం, జాగ్రత్తగా ఉండాలి. వాళ్ళు సత్పురుషులు అయితే మీరు వారిని ఫాలో అవ్వవచ్చు. అసలు వాళ్ళ మనస్సులు ఎలా ఉన్నాయి, వాళ్ళు లోపల ఎలా ఉన్నారు, దానినిబట్టి స్నేహం చేయాలి. మా కుటుంబం అంటే ఆ కుటుంబంలోని వాళ్ళు మిమ్మల్ని ఉద్ధరిస్తారని చెప్పలేము. మీరు బాగుపడితే ఏడవకుండా ఉంటే సరిపోతుంది. సత్యాన్వేషకుడికి ముందు శత్రువులు కుటుంబసభ్యులే, దారినిపోయే వాళ్ళకు మీ మీద అసూయ ఎందుకు వస్తుంది? మీరు బాగుపడితే ముందు ఇంట్లో వాళ్ళకే వస్తుంది, అది నేచర్. అది అర్థం చేసుకొని, మెలకువగా ఉండి, మన పద్ధతిలో మనం ఉండటం ఉత్తమం.

భగవాన్ మాకు దేవుడు కాదు, వాడు మా కుటుంబసభ్యుడు. ఏదో ఒకసారి స్తోత్రం చేసినా, ఒకసారి కోపం వచ్చినా ఆ అనుబంధం పోలేదు. ఇంతవరకు నా చేతులతో ఆయనకు పూజ చేయలేదు. కాని ఆయన హృదయనివాసి. మాకు ఎప్పుడు బలం ఇవ్వాలో చూసుకొని అప్పుడు బలం ఇస్తూ ఉండేవాడు. హృదయంలో నుండి మనకు శక్తి ఎప్పుడు సప్లయి చెయ్యాలో అవసరమైనప్పుడు చేస్తూ వచ్చారు. మీరు ఎదుటిమనిషికి ఉపకారం చెయ్యవచ్చు కాని అదే పనిగా పెట్టుకోకూడదు. మీరు ఎవరికైనా మంచి చెయ్యవచ్చు కాని గమ్యం అదికాదు. ట్రూత్ రియలైజేషన్ మీ గమ్యం. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నువ్వు రియలైజ్ చేయవలసిందే, ఇంకో మార్గం లేదు. నీ హృదయంలో ఉన్న సత్యం మాత్రమే నిన్ను బంధాల నుండి విడిపించగలదు కాని ఇంకో దారి లేదు. భగవాన్‌కి అసలు సృష్టిలేదు. నేను కాశీ వెళతాను అని వాళ్ళ అమ్మగారు అంటే కాశీ అనే రెండు అక్షరాలు మరిచిపో ఏమీలేదు అన్నారు. ఇక్కడ తేడా ఏమిటి అంటే ఆయనకు సృష్టిలేదు. పుణ్యక్షేత్రాలు తిరగటం మంచిదే,

దానివలన ఎంతోకొంత పుణ్యం వస్తుంది. కాశీ ఎక్కడ ఉంది? ప్రపంచంలో ఉంది. అసలు ప్రపంచమే లేనివాడికి కాశీ ఏమిటి? భగవాన్‌ది లేటెస్టు టెక్నాలజీ. మా ప్రారబ్ధం బాగాలేదు అంటారు. దానిని నువ్వు కేర్ చెయ్యవలసిన అవసరం లేదు. ప్రారబ్దం ఎవరికి అంటే దేహానికే. అయితే ఆ దేహం నువ్వు కాదు కదా! నువ్వు నేను, నేను అంటున్నావు, అది దేహానికి పరిమితమై ఉంది. ఆ దేహమే నువ్వు అనుకొంటున్నావు. దేహబుద్ధి పోయినప్పుడు, దేహంతోటి నీకు తాదాత్మ్యం పోయినప్పుడు నిన్ను ప్రారబ్దం ఏమి చేస్తుంది? అది చెడ్డగా ఉంటే ఉండనియ్యి. ప్రారబ్దం నీ దేహానికి మాత్రమే, నీ లోపలఉన్న చైతన్యానికి కాదు. ఎంత చెడ్డప్రారబ్దం అయినా అదేమి చేస్తుంది. అది నువ్వు కాదు కదా! దేహాన్ని ప్రారబ్దానికి వదిలెయ్యి, దేహం ఎప్పుడు ఎక్కడ ఎలా ఉండాలో అప్పుడు అక్కడ అలా ఉంటుంది. దేహయాత్ర మన చేతిలో లేదు, అది ప్రారబ్దాన్ని బట్టి నడుస్తుంది. నువ్వు సత్యాన్వేషణ చెయ్యి. ఇది భగవాన్ టీచింగ్.

ఇప్పుడు మీరందరు కనిపిస్తున్నారు. నేను మీ పట్ల చూపించే ఆప్యాయత కంటే మీరే నాపట్ల ఎక్కువ ఆప్యాయత చూపిస్తున్నారు. అంటే జనసమూహం మీద చెపుతున్నాను, ఒకరు ఇద్దరిగురించి కాదు. నేను అప్పుడప్పుడు ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చొన్నప్పుడు పరిశీలిస్తాను. అలా పరిశీలించినప్పుడు మీ పట్ల నాకు ఎంతోకొంత ఆప్యాయత ఉంది, అసలు లేదని నేను చెప్పను. కాని మీ పట్ల నేను చూపిస్తున్న ఆప్యాయత కంటే మీరందరు నాపట్ల ఎక్కువ ఆప్యాయత చూపిస్తున్నారు. అందుచేత ఒకరకంగా నేనే మీకు ఋణపడి ఉన్నాను. ఈ టీచింగ్ అనేది సెకండరీ. అందుచేత మీరు నాపట్ల చూపిస్తున్న అభిమానం, ఆప్యాయత, లవ్ అండ్ ఎఫెక్షన్ అది నేను మరిచిపోవటానికి వీలులేదు. ఈ శరీరం ఉన్నా, శరీరం లేకపోయినా అది నా స్మృతిలో ఉండిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-10-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు విజయదశమి. మా ఇంటికి భగవాన్ భవనము అని చిన్నపేరు పెడుతున్నాము. భగవాన్ అంటే ఎవరు అని. రమణభక్తులందరు భగవాన్ అంటే రమణమహర్షి అని మనం అలవాటు పడ్డాము. అది మంచి అలవాటే కాని భగవాన్ అంటే పరమాత్మ, భగవాన్ అంటే బ్రహ్మం. ఏదైతే జ్ఞానులు పరమాత్మ అని, బ్రహ్మం అని పిలుస్తున్నారో దానినే భక్తులు భగవాన్, భగవాన్ అని పిలుస్తారు. గణపతిశాస్త్రిగారు నిర్దేశించింది ఏమిటి అంటే రమణమహర్షి పరమాత్మ తాలుక, చైతన్యం తాలుక అనుభవం పొందారు కాబట్టి అంటే బ్రహ్మమే అయ్యారు కాబట్టి భక్తులు ఆయనను భగవాన్ అని పిలుచుకోవటం మంచిది

అని చెప్పారు. పరమాత్మ అన్నా, బ్రహ్మం అన్నా, ఈశ్వరుడు అన్నా, భగవాన్ అన్నా ఇవన్నీ పర్యాయ పదాలు. చెప్పటానికి ఏముంది? నిశ్శబ్దంలో అసలు మనుషులు లేరు. గాఢనిద్రలో మనకు మనుషులు ఎవరూ లేరు. గాఢనిద్రలో మనం ఎవరికి బోధిస్తాము, బోధించటానికి అక్కడ ఎవరూ లేరు. మనస్సు శబ్దం చేస్తున్నప్పడే మనకు ఇతరులు ఉన్నారు. మనస్సు నిర్మలంగా ఉన్నప్పడు, మనస్సు శాంతిగా ఉన్నప్పడు, మనస్సులో ఏరకమైన ఆందోళన, అలజడి లేనప్పడు మనకు ఇతరులు అంటూ ఎవరూ లేరు. మనకు తల్లి అయినా, తండ్రి అయినా, బంధువు అయినా, దేవుడు అయినా అంతా గురువే. మనకు ఏదైనా కష్టం వచ్చినప్పడు గురువు ఇచ్చిన రక్షణ బంధువులు ఇవ్వలేరు. గురువు ఇచ్చే రక్షణ మన కళ్ళకు కనబడదు, మన చెవులకు వినబడదు. ఆయన ఇచ్చే అనుగ్రహం కూడా పొందినవారికి అది తెలియాలి అని వాళ్ళు అనుకోరు ఎందుచేతనంటే చైతన్యంలో ఇతరులు లేరు.

మనం నేను, నేను అంటున్నాము. ఇది ఒక తలంపు. కాని గీతలో భగవంతుడు వాడిన నేను మటుకు తలంపుకాదు. అది మూడు కాలాలతో సంబంధం లేనిది, మూడు అవస్థలతో సంబంధం లేనిది, అది వీటి అన్నింటికి అతీతమైనది. మన ఉపనిషత్‌లు ఇలా చెపితే ఆ నేను నేనై ఉన్నాను అని ఏసు చెప్పాడు. భగవాన్ ఏమన్నారు అంటే దానికి దేహంతోటి, మనస్సుతోటి, ప్రపంచంతోటి, ఇష్టాలు అయిష్టాలుతోటి, చావుపుట్టుకలతోటి ఏమీ సంబంధం లేదు అని చెప్పారు. ఈ మధ్యన ఒక ఋషి ఏమన్నాడు అంటే వివాహం మానేసి జీవించటానికి మించిన తపస్సు అంటూ లేదు. ఆ తపస్సు చేసినవాడికి ఈ నేను అనుభవానికి వస్తుందేమో అని చెప్పాడు. అది ఆయన అభిప్రాయం చెప్పాడు. అయితే బ్రహ్మచారులు చాలామంది ఉన్నారు వాళ్ళందరికీ ఈ నేను అనుభవంలోనికి వచ్చింది అని మన చరిత్రలో ఎక్కడా లేదు. ఈ విషయంలో మనకు ఉపనిషత్తే ప్రమాణం. ఆ నేను ఎవరికి తెలియబడాలి అని అనుకొందో వారికి మాత్రమే అది తెలియబడుతుంది అని చెప్పారు. అది ఒక్కటే ఫైనల్. దానికి సత్వగుణం ఉండాలి.

మనమాట, చేత, మనస్సు పరిశుద్ధంగా ఉంచుకోగలిగితే ఈ నేను తప్పనిసరిగా మనకు అనుభవంలోనికి వస్తుంది. అసలు ఈ భూమి మీదకు వచ్చిన పని ఈ మూడింటిని మనం మలినం చేయకూడదు. నీ మనస్సును పవిత్రం చేసుకో. నీమాటను, చేతను, మనస్సును శుద్ధిచేసుకోవటంకంటే మించిన పని ఏమైనా ఈ లోకంలో నీకు ఉందా? మీరు నామస్మరణ చెయ్యండి లేకపోతే మీ పద్ధతిలో మీరు ఏదో సాధన చెయ్యండి, ఈ మూడు కనుక పవిత్రం అయితే ఈ తలంపులకు, ఆలోచనలకు, ట్రబుల్స్‌కు, స్ట్రగుల్స్‌కు అన్నింటికీ అతీతంగా ఉన్న ఈ పవిత్రమైన నేను, నిజమైన నేను మనకు అనుభవంలోనికి వచ్చే అవకాశం ఉంది. అది మటుకు తలంపు కాదు. జీవితంలో అన్నీ తలంపులే. శరీరానికి సంబంధించిన

మరణం ఒక తలంపు, పుట్టుక ఒక తలంపు, మీకు వచ్చే సంతోషం ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు. అన్నీ తలంపులే. అయితే ఇంక తలంపు కానిది హృదయంలో ఉన్న నిజం ఒక్కటే. అదే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. ఆ నేను ఉందని తెలుసుకోవటం వేరు, అది మనకు అనుభవం లోనికి రావటం వేరు. ఇందులో చాలా తేడా ఉంది. అది ఉందని ఎప్పుడైనా మనకు స్ఫురించవచ్చు. కాని ఇప్పుడు మనకు మనో దేహములతో ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ నీ హృదయంలో ఉన్న నిజంతో మనకు తాదాత్మ్యం రావాలి. అది ఏదో కడసారి జన్మలో జరిగే పని. అంటే దానికి ఎంతో పూర్వపుణ్యం ఉండాలి. అంటే ఎన్నో జన్మల సాధనాఫలంగా, ఆ పుణ్యం తాలుక పంటగా అది నీకు లభ్యమవుతుంది.

స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. మనోనిగ్రహం వల్ల, ఇంద్రియనిగ్రహం వల్ల వాటిని హృదయగతం కనుక చేస్తే అప్పుడు హృదయంలో ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి వస్తుంది. నిన్ను బంధాల నుండి విడిపిస్తుంది. అయితే హృదయంలో ఉన్న నిజం మీకు నేనుగా వ్యక్తమైనా, అది మటుకు ఇప్పుడు మీరు చెప్పకొనే నేను లాంటిదికాదు. మనం నేను, నేను అంటాము కదా. అది ఒక తలంపు. అయితే నిజం మటుకు తలంపుకాదు. మీరు అనుకొనే పుణ్యపాపాలు, మంచిచెడ్డలు, స్వర్గనరకాలు అన్నీ తలంపులే. మీరు ఊహించేవి అన్నీ తలంపులే. లౌకికబంధాలు, బంధుత్వాలు, స్నేహాలు, విరోధాలు ఈలోకానికి సంబంధించినవి అన్నీ తలంపులే. లోకం కూడా తలంపే. అయితే ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే తలంపు కానిది ఏదైనా ఉందా అంటే అది నీ హృదయంలో ఉన్న నిజం ఒక్కటి మాత్రమే. అది మటుకు తలంపుకాదు. అది నీకు అనుభవైకవేద్యం అయినప్పుడు దానికి దేవుళ్ళతోటికాని, దేవతలతోటికాని, ప్రకృతివిషయాలతోటికాని, మనోదేహములతోటి గాని దేనితోను ఎట్టి సంబంధం లేదు. అది 100% అన్‌రిలేటెడ్. ఎక్కడా ఏరకమైన అనుబంధమూ దానికి లేదు. అది ఎలా ఉండాలో అలాగే ఉంది కాని అది మన ఊహకు అందే విషయం కాదు. అది తెలియబడాలి అనుకొన్నవారికి మాత్రమే తెలియబడుతుంది. వారి బిహేవియర్ పేటరన్ బట్టి అది తెలియబడుతుంది. అసలు అందం అనేది బయట లేదు, లోపలే ఉంది. నీ మనస్సు పవిత్రం అయినప్పుడు, నీ మనస్సు నిర్మలమైనప్పుడు, నీ మనస్సు ఏకాగ్రమైనప్పుడు లోపల అందం నీకు గోచరిస్తుంది.

మనం సుఖంకోసం, శాంతికోసం బయట వెతుకుతున్నాము. సుఖం, శాంతి మన హృదయంలోనే ఉన్నాయి. అది మనకు తెలియకపోవటం వలన, దాని తాలుక ఎరుక మనకు లేకపోవటం వలన సుఖంకోసం, శాంతికోసం ఏదో బజారులో, సినిమా హాళ్ళలో, హోటళ్ళలో ఎక్కడో ఒకచోట బయట వెతుకుతున్నాము. మానవుడు చేసేది సుఖాన్వేషణే కదా. భగవాన్ ఏమన్నారు అంటే ప్రపంచంలో ఏ వస్తువులోను, ప్రపంచంలో ఎక్కడా

సుఖం అనేది, శాంతి అనేది లేదని ముందు మీకు అవగాహన రావటంలేదు. బయట ఎక్కడా ఏమీలేదు. నువ్వు శాంతిని పొందాలంటే, సుఖాన్ని పొందాలంటే నీ హృదయ స్థానంలోనికి రావలసిందే. బయట ఎక్కడో ఏదో ఉంది, సుఖం ఉంది అని మనం దానిని సాధిస్తాము అనుకోండి. అక్కడ కూడా శాంతిలేదు, సుఖం లేదు అని దానిని పొందిన తరువాత మనకు తెలుస్తుంది. మీరు ఇష్టాన్ని ప్రేమ అనుకొంటున్నారు, రాగాన్ని ప్రేమ అనుకొంటున్నారు. రాగం వేరు, ప్రేమ వేరు. ప్రేమ అనేది నామరూపాలకు అతీతమైనది, ప్రేమ వ్యాపారం చెయ్యదు, చైతన్యానికి మరో పేరే ప్రేమ. బుద్ధుడుకాని, ఏసుకాని హద్దులు లేకుండా, అంత అమితంగా ఈ లోకాన్ని ప్రేమించటానికి కారణం ఏమిటి అంటే వాళ్ళు ఉన్నది ప్రేమసముద్రంలో కాబట్టి లోకాన్ని అంతగా ప్రేమించారు. ప్రేమకు కోరికలు లేవు. అన్ని కోరికలు తీరిపోయినప్పుడు, అన్ని కోరికలు నెరవేరినవాడు ఎంతశాంతిగా ఉంటాడో, అటువంటి శాంతిలో నుండి నిజమైన ప్రేమ వస్తుంది. అది కోరికలోనుండి రాదు. కోరిక వ్యాపారం చేస్తుంది. విషయం మనకు అవగాహన అయితేనే కాని ఎంతోకొంత సాధన చెయ్యాలి అనేటువంటి మనస్సు కూడా మనకు కలుగదు. అవగాహన కూడా యోగం తోటి సమానము.

స్వామి శివానంద చెప్పేవారు, నువ్వు అనుకొనే దేహము నువ్వు కాదు, నువ్వు అనుకొనే మనస్సు నువ్వు కాదు, నీలోపల ఉన్న వికారాలు నువ్వు కాదు, మృత్యువుతో సంబంధం లేని సద్వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది, అది నీవై ఉన్నావు అని శివానంద రిపీటెడ్‌గా చెప్పేవారు. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే అది నువ్వు కాదు, ఇది నువ్వు కాదు అని అనుకోవటం కంటే నువ్వు ఏదిగా ఉన్నావో అదిగా నువ్వు ఉండటానికి ప్రయత్నం చేస్తే ఎక్కువలాభం పొందుతావు అని చెపుతున్నారు. నువ్వు కానిదానిని నేను కాదు, నేను కాదు అనుకోవటం కంటే నువ్వు ఏదైతే అవునో అదిగా ఉండటానికి ప్రయత్నం చేస్తే ఎక్కువ లాభం పొందుతావు అని చెపుతున్నారు. నువ్వు కానిది ఎలాగ అవ్వవు కదా! అందువలన అదికాదు, ఇదికాదు అని అనుకోవటం వలన ప్రయోజనం ఏమిటి? అది ఎలాగు నువ్వు కాదు కదా! అంటే మనస్సును లోపలకు తోలుకెళ్ళటానికి ఒక ఉపాయం చెపుతున్నారు. మనకు సత్వగుణం ముఖ్యం. సత్వగుణాన్ని మనం ప్రాక్టీసు చేస్తూ ఉంటే మనస్సు నెమ్మదిగా అంతర్ముఖమవుతుంది. మీ శరీరాన్ని ఎక్కువ శిక్షించనక్కరలేదు. మీ మనస్సును, శరీరాన్ని ఎక్కువ బాధ పెట్టనక్కరలేదు. దైనందినజీవితంలో మీరు సత్వగుణాన్ని ప్రాక్టీసు చేస్తూ ఉంటే మీకు గర్వం రాదు, అహంభావన తగ్గిపోతుంది. నువ్వు ధనాన్ని, జనాన్ని, గౌరవాలను, అధికారాలను కోరుకున్నంతకాలం నీకు సత్వగుణం ఎలాగ వస్తుంది? కొంతమంది ఏదైనా మంచిపనులు చేసినా జనంకోసం చేస్తారు. నీకు ఏదైనా మంచి

పని చేయాలంటే చెయ్యికాని జనాకర్షణ కోసం చెయ్యవద్దు. నీకు ఏదైనా మంచిపని చేయాలంటే మంచికోసమే అది చెయ్యి. మంచివారు, బుద్ధిమంతులు కూడా దీనిని సాధించలేకపోవటానికి గుర్తింపులు కోరుకోవటం ఒక్కటే కారణం. ఇంట్లో పని చేసి కూడా గుర్తింపులు కోరుకుంటారు. బండెడు చాకిరీ చేస్తున్నాము ఇంట్లో ఎవరూ గుర్తించటం లేదు అంటారు. ఆ గుర్తింపులు కోరేది సైతాను. అది మనకు తెలియటంలేదు. ఎవరిమటుకు వారు చుట్టాలలాగ వచ్చి తినేసిపోతున్నారు, మేము చేసేకృషి ఎవరూ గుర్తించటంలేదు అంటారు. ఎవరూ గుర్తించటంలేదు అనుకోవటమే పొరపాటు. అక్కడ భగవంతుడు గుర్తిస్తున్నాడు. భగవంతుడికి తెలియకుండా మనం ఏ పని చేయలేము, అసలు తలంపు కూడా రాదు. మనకు వచ్చే ప్రతీతలంపుకి కూడా ఆయనే సాక్షి. మీకు వచ్చే ప్రతీతలంపు విషయంలో జాగ్రత్తగా ఉండండి. చిన్న తలంపుల విషయంలోకూడా జాగ్రత్తగా ఉండండి. ఎందుచేతనంటే ఆ తలంపులే మీ కేరక్టర్‌ను నిర్మిస్తున్నాయి. మనం తలంపుల విషయంలో అజాగ్రత్తగా ఉంటాము, అశ్రద్ధగా ఉంటాము. అయితే మన కేరక్టర్‌ను నిర్మించేవి ఆ తలంపులే. నువ్వు మనస్సులో మంచితనాన్ని కనుక సంపాదించగలిగితే అది జ్ఞానానికి దారి చూపిస్తుంది అంటాడు సోక్రటీసు.

ఉన్నదంతా మీలోపలే ఉంది. మీ ఇంట్లో ఏ గదిలోకి ఎలా వెళ్ళాలి అంటే మీకు ఇంకొకరు చెపితేనేగాని మీరు వెళ్ళలేరా? మీ మనస్సు ఏకాగ్రమైతే, మీ మనస్సు పవిత్రమైతే అక్కడికి వెళ్ళటానికి అంటే మీ హృదయంలోనికి వెళ్ళటానికి మీ మనస్సే దారి చూపిస్తుంది, అది బయటవాళ్ళు చూపించేది కాదు. మనిషి కేవలం తిండికి, బట్టకు కాకుండా ఎంతోకొంత పోగుచేసుకొంటూ ఉంటాడు. వాడు పోగుచేసుకొన్నది చూసుకొని వాడే మురిసిపోతూ ఉంటాడు. మీరు బాగా ధనవంతులు అని ఎవరైనా ఇతరులు అంటే అది మీకు సంతోషం కలుగజేస్తుంది. మీరు సంపాదించిందంతా మీరు చూసుకొని సంతోషించటానికే కేపటలిజం వచ్చింది అని సోక్రటీస్ చెప్పాడు. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే ఇది నేను సంపాదించాను, ఇది నాది అని అందరూ అంటున్నారు. బతికిన నాలుగు రోజులు ఇలా అస్తమానూ నేను సంపాదించాను, నేను సంపాదించాను, ఇది నాది, ఇది నాది అని ఇలా అనుకొంటూ నీ కాలాన్ని వేస్టు చేసుకొని నువ్వు చస్తున్నావు. సంపాదిస్తే సంపాదించుకో. అస్తమానూ 24 గంటలు ఈ గొడవ ఏమిటి? నీ టైము పాడైపోతోంది. మనిషి ఎంతకాలం జీవిస్తాడు. ఈరోజు మనం ఆరోగ్యంగా ఉన్నాము, రేపు ఎలా ఉంటామో చెప్పలేము. అందుచేత నేను సంపాదించాను, నేను సంపాదించాను అని ఇలా నువ్వు మురిసిపోతూ కూర్చుంటే ఈ లోపులో నీ శరీరం చనిపోతుంది. నువ్వు సంపాదించిందంతా డ్రీమ్ స్టఫ్. నువ్వు సంపాదించింది ఏదీ మరణానంతరజీవితంలో నీకూడారాదు. మీరు సంపాదించింది ఎవడో

తింటాడు. తినేవాడిని భగవంతుడు పురమాయిస్తాడు, ఆ ఏర్పాట్లు అన్నీ జరిగిపోయాయి. నేను సంపాదించాను, నేను సంపాదించాను అని అస్తమాను రిపీట్ చేసుకొంటూ నువ్వు కాలాన్ని వృథా చేసుకొంటున్నావు, ఎనర్జీని వేస్టు చేసుకొంటున్నావు. మీరు పొందవలసింది బయట ఏమీలేదు, లోపలే ఉంది. మీరు బయట బాగున్నారు, లోపల ఎలా ఉన్నారో? లోపల కూడా బాగుచేసుకోవాలి కదా! మీరు పొందవలసింది అంతా లోపలే ఉంది. రామకృష్ణ పరమహంసను చూస్తే పైకి ఏమి కనబడుతుంది. ఒక తుండు గుడ్డ ఉంటుంది. అంతకంటే ఏమీ లేదు. హోమ్‌లెస్, ప్రోపర్టీలెస్. కాని లోపల ఎంత దూరం వెళ్ళాడు, ఎంత లోయల్లోకి దిగాడు, ఏ చైతన్యస్థాయిని అందుకొన్నాడు. అది మన కళ్ళకు కనబడదు. బయట ఎచ్ఛీవ్ చేసిందే మీ కళ్ళకు కనిపిస్తోంది కాని మానవుడు లోపల ఎచ్ఛీవ్ చేసింది మీ కళ్ళకు కనిపించటం లేదు. అంటే అది కళ్ళు ఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు.

భగవాన్ కొండదిగి నెమ్మదిగా వస్తున్నారు. అలా నడిచివస్తూ ఉంటే కొండదగ్గర పని చేసుకొనేవాడు ఒకడు వాడు చేసే పని మానేసి భగవాన్‌కు నమస్కారం పెట్టాడు. భగవాన్‌ది ఇంపెర్సనల్ లైఫ్. ఇప్పుడు మనకు నమస్కారాలు పెట్టకపోతే కోపం. ఇప్పుడు మీరు ఇంటి దగ్గర చిన్నకారు ఎక్కేలోపులో అమ్మగారు వస్తున్నారు తప్పకోండి, తప్పకోండి అని చెప్పేవాళ్ళు ఉంటే మీకు చాలా సరదాగా ఉంటుంది. అలా మీరు మనుషుల్ని పురమాయించుకోవాలి. ఇవన్నీ కూడా కృత్రిమ గౌరవాలు. ఈ రకంగా మానవుడు కృత్రిమ జీవితానికి అలవాటుపడిపోయాడు. వాడు పనిమానేసి భగవాన్‌కు నమస్కారం పెడితే భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఏదో పని చేసుకొంటున్నావు, నా దారిన నేను వెళ్ళిపోతున్నాను. పనిమానేసి నాకు నమస్కారం పెట్టటం ఎందుకు? నువ్వు చేసుకొనే పని కూడా నమస్కారంతోటి సమానం. పనిలో దేవుడిని చూడటం నేర్చుకో. పనికూడా దేవుడే. పనిద్వారా దేవుడికి నమస్కారం పెడుతున్నాను అనే భావన విడిచిపెట్టకు. ఇది మీరు బాగా గుర్తు పెట్టుకోండి. నోటితోటి స్తోత్రాలు కాదు. పనిద్వారా కూడా దేవుడిని ఆరాధించవచ్చు. చేతులతోకూడా ఆయనను ఆరాధించవచ్చు. పనిచేసి దాని ఫలితాన్ని ఈశ్వరుడికి సమర్పించవచ్చు. దాని వలన కూడా మీ మనస్సు పవిత్రం అవుతుంది. మనస్సును పవిత్రం చేసుకోవటంకంటే మించిన పనిలేదు. మనకు వచ్చే ప్రతీ చెడు తలంపుకి మనం ఏదోరోజున సమాధానం చెప్పాలి. నువ్వు పని మానేసి వచ్చి నాకు నమస్కారం పెడతావు ఏమిటి? మన దేశంలో ఉన్న పెద్ద చెడ్డ ఇది. ఇక్కడ పనిముఖ్యంకాదు, యజమానులపట్ల ఎక్కువ వినయంగా ఉంటే చాలు అనుకొంటారు. అలాకాదు పనే ముఖ్యం, వినయం అనేది రెండో పక్షం. పనిమానేసి వినయంగా ఉండమనికాదు. అందుచేత నువ్వు పనిలో దేవుడిని చూసుకో. పని కూడా దేవుడికి పెట్టే నమస్కారం లాంటిదే. ఇలా పనిమానేసి

నమస్కారాలు అక్కరలేదు. మా అమ్మ చాలా మంచిది, మా అమ్మ చాలా మంచిది అని నోటితో చెప్పేవాళ్ళు మంచివారా? అమ్మకు సేవచేసేవాళ్ళు మంచివారా? ఎందుకీ లిప్ సర్వీసు. చేతులతో సేవ చేయటం మానేసి పెదాలతో చేస్తారా? వట్టిమాటలవలన వచ్చే ప్రయోజనం ఏమిటి? మీ అమ్మగారు మంచంపడితే సేవ చేయటం మానేసి కాళ్ళకి పూజ చేస్తారా? అది కాదు. ఇక్కడ పని కూడా పూజే. మీరు అంతటివారు, ఇంతటివారు అని నోటితో చెప్పేమాటలకంటే నిర్మలంగా, నిరాడంబరంగా మీరు చెయ్యగలిగిన పని, మీరు ఎవరికైతే చేస్తున్నారో వారు శాంతిగా ఉండేటట్లుగా మీరు చెయ్యగలగటమే దేవుడికి చేసే ఆరాధన. కొంతమంది సేవచేసి తరువాత తిడుతూ ఉంటారు. నీకు సేవ చేయవలసి వస్తోంది, నిన్ను కాళ్ళు ఎవరు విరగగొట్టుకోమన్నారు అని తిడతారు. అటువంటి సేవలు వద్దు. అది ఆరాధన కాదు. నువ్వు నిజంగా చేసే సాష్టాంగనమస్కారాలు ఏమిటి అంటే నువ్వు ఎవరికైతే సేవ చేస్తున్నావో అది వారికి ఉపయోగపడాలి, దాని వలన వాళ్ళు శాంతిగా ఉండగలగాలి. వాళ్ళు మంచం పట్టారని నువ్వు వారిని అవమానం చెయ్యకు. వాళ్ళు ఏదో చిరాకు మాటాలు మాట్లాడారని నువ్వు అవమానం పొందకు.

ఈమధ్య ఒక ముసలమ్మగారు మా దగ్గరకు వచ్చారు. మా ఆయన తినేసి పడుకొంటున్నాడు, ఇంకేమి పనిలేదు అన్నారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. ఏమైనా అల్లరి చేస్తున్నాడా అని అడిగాను. అల్లరి ఏమీలేదు తిని పడుకొంటాడు అని చెప్పారు. అంటే మీరు సేవచేయటానికి మీ భర్త ఒక అవకాశం ఇస్తున్నాడు. మీరు చేయగలిగింది ఏదో చెయ్యండి. ఆయనకు పని చేసే శక్తి తగ్గిపోయిందికదా! 84 సంవత్సరాల వయస్సులో తిని పడుకోకపోతే ఏమి చెయ్యమంటారు. అంటే పతికి సేవచేయటానికి ఆ అమ్మగారికి భగవంతుడు ఒక అవకాశం ఇచ్చాడు. ఈ అవకాశాన్ని ఆవిడ వదులుకొంటున్నారు. కొంతమంది దేశానికి సేవచేయనక్కరలేదు, గ్రామానికి సేవచేయనక్కరలేదు, వాళ్ళ ఇంట్లో వారిని చూస్తే సరిపోతుంది. వాళ్ళు దేశానికి ఉపయోగపడేంత పెద్దవాళ్ళు కూడా కాదు, అంత పెద్ద హృదయం ఉండటం కూడా కష్టం. వాళ్ళ గురించి వాళ్ళు ఆలోచించుకోవటం మానేసి నిరంతరం ఇతరుల గురించి ఆలోచించేవాళ్ళు ఈ ప్రపంచంలో కొద్దిమంది మాత్రమే ఉంటారు, అసలు లేకపోలేదు. వాళ్ళకు ప్రత్యేకంగా వ్యక్తిగతంగా ఏమీ అక్కరలేదు. వాళ్ళ శరీరం కాలి బూడిద అయ్యేవరకు ఇతరులకు ఉపయోగపడుతూనే ఉంటారు, ఇతరుల గురించి ఆలోచిస్తూనే ఉంటారు. అటువంటివారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. జన సమూహం మీద వాళ్ళను కొలవటానికి వీలులేదు, వాళ్ళను భగవంతుడు తయారుచేస్తాడు. వాళ్ళు కొంతమంది ఈ ప్రపంచంలో ఉండటం వల్లే ఈ లోకంలో ఏదో ఎస్సెన్స్ ఉందని మనకు అనిపిస్తుంది.

ఇప్పుడు మనకు ఉన్న జ్ఞానం మిథ్యాజ్ఞానం. అంటే ఇంద్రియాలద్వారా విషయాలను సేకరిస్తున్నాము. మనది విషయజ్ఞానం, ఆత్మజ్ఞానంకాదు. ఇప్పుడు మనం సంపాదించే జ్ఞానం వలన పొట్ట వెళ్ళవచ్చునుకాని ఆత్మజ్ఞానం కలుగదు, సత్యసాక్షాత్కారం కలుగదు, ట్రూత్‌ను రీలైజ్ చేసే అవకాశం లేదు. ఎందుచేతనంటే మనం చదివే గ్రంథాలకు, మన మనస్సుకు, ఇంద్రియాలకు, మన బుద్ధికి అది అందదు. ఎక్కడైతే బుద్ధి పూర్తిగా అణిగిపోయిందో, ఎక్కడైతే ఈ మనస్సు, ఇంద్రియాలు పూర్తిగా అణిగిపోయాయో, ఎక్కడైతే వ్యక్తిభావన పూర్తిగా శేషం లేకుండా కాలిపోయిందో అక్కడ మాత్రమే నిజం తానుగా ప్రకాశిస్తుంది. సోక్రటీసు అంటాడు ఆత్మ తనంతట తానుగా ప్రకాశించకపోతే నువ్వు ఏమి చెయ్యగలవు? నీలోపల ఉన్న చైతన్యం తనంతట తానుగా ప్రకాశించకపోతే నీ సాధనలు, నీ మాటలు, నీకుయుక్తులు, నీ తెలివితేటలు దానిని ప్రకాశింపచేస్తాయా? మీరు సంపాదించిన ఆస్తులు, గౌరవాలు దానిని ప్రకాశింపచేస్తాయా? మీరు బాహ్యంగా ఏదో ఎఛ్ఛీవ్ చేస్తున్నారు కదా! అది నీ లోపల ఉన్న చైతన్యాన్ని ప్రకాశింపచేస్తుందా? లోపలఉన్న చైతన్యం వారంతటవారు ప్రకాశిస్తే నువ్వు దర్శించటానికి పనికివస్తావు కాని నువ్వు బయట సాధించిన విషయాలవల్ల దానిని ప్రకాశింపచేయగలవా? అది సాధ్యం కాదు. ఉపనిషత్తుల కంటే చాలా అందంగా సోక్రటీసు చెప్పాడు. తనంతట తానుగా ప్రకాశిస్తే మీరు దర్శించటానికి పనికి వస్తారు కాని మీరు జీవితంలో ఏవో కొన్ని సాధించారు కదా మీరు సాధించిన దానివల్ల దానిని ప్రకాశింప చేయగలరా? అది సాధ్యమా అంటే అది సాధ్యం కాదు.

నేను కొంతవేదం చదువుకున్నాను. ఇతర గ్రంథాలను కూడా శ్రద్ధగా అధ్యయనం చేస్తున్నాను. దానివలన నాకేమైనా ఆత్మజ్ఞానం కలుగుతుందా అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. మీ ఇంట్లో పిల్లలు బాగా చదువుకొంటున్నారు అనుకోండి. విద్యవల్ల వినయం రావాలి. విద్యవల్ల వినయం రాకుండా గర్వం వస్తే అది అసలు విద్యకాదు. చాలామంది మనుషులు పాడైపోవటానికి గర్వమే కారణం. అది ఎలా వస్తుందో మీకు తెలియదు, తెలియకుండా వచ్చేస్తుంది. అందుచేత మీరు ఎక్కువగా కష్టపడవద్దు. మీ శరీరాలను శుష్కింపచేయవద్దు, మీ మనస్సును ఇబ్బంది పెట్టవద్దు. ఒక్కటే సూత్రం. మీరు సత్వగుణాన్ని నెమ్మదిగా ప్రాక్టీసు చెయ్యండి. మీకు రావలసినవన్నీ భగవంతుడు సమకూరుస్తాడు. భౌతిక విషయాలు అయినా మీకు సమకూర్చి ఆ భౌతిక విషయాలతోపాటు జ్ఞానాన్ని కూడా ప్రసాదిస్తాడు. అయితే మీ ప్రవర్తన, మీ మాట, మీరు చేసే పని ఎక్కడ చూసినా నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి. మీరు చేసే పని మీ సత్వగుణాన్ని అభివృద్ధి చేసేలాగ ఉండాలి. మీ శరీరాన్ని, మనస్సును కాల్చుకు తినకండి. అంతదూరం అక్కరలేదు.

మీరు సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యండి సరిపోతుంది. కొంతమంది ఇంట్లో ఎదురుగా ఉన్న వారితో కూడా గట్టిగా పెద్దపెద్దకేకలు వేసి మాట్లాడతారు. ఇంట్లో ఎదురుగా ఉన్నారు వినబడుతుంది కదా ఎందుకు అలా అరుచుకొంటున్నారు. ఈ అరుచుకోవటాలు కూడా ఎక్కువ రజోగుణంలో నుండి వస్తాయి. ఇవన్నీ జరుగుబాటు కోపాలు. సాధ్యమైనంతవరకు నెమ్మదిగా మాట్లాడాలి, వాళ్లకు అర్థమయ్యేలాగ మాట్లాడాలి.

మేము గ్రంథాలు బాగా చదువుతున్నాము, మాకు జ్ఞానం కలుగుతుందా అని అడిగితే కలగదు అంటున్నారు భగవాన్. మీరు అడిగింది ఆలోచించి చెపుతాను అనటంలేదు. మీకు జ్ఞానం కలిగే అవకాశం లేదు అని మొహమాటంలేకుండా చెప్పేస్తున్నారు భగవాన్. మీకు డబ్బులు ఉంటే బజారులో పుస్తకాలు దొరుకుతాయి, కొనుక్కొని చదువుకోండి. అంతమాత్రం చేత మీకు జ్ఞానం కలుగదు. మీకు పాండిత్యం వస్తుంది. ఇతరులకు చెప్పటానికి ఉపయోగపడతాయి. మీరు బాగుపడటానికి పనికిరాదు, మీరు బాగుపడరు. నువ్వు పుస్తకాలు చదవుకొంటాను అంటున్నావు చదువుకో, ఇతరులకు చెప్పవచ్చు. నీకు ఏమీ రాదు, నీ పని సున్న. ఏమో చెప్పగా చెప్పగా ఏమిటి అందరికీ చెపుతున్నాము, మనకు ఏమీ తెలియటంలేదు అని షాక్ నీకు కూడా రావచ్చు. ఇది భగవాన్ చెప్పటంలేదు కాని నేను చెపుతున్నాను. చెప్పగా చెప్పగా మీకు ఏమి అనిపిస్తుంది అంటే ఇన్ని విషయాలు చెపుతున్నాము, ఒక్కటీ ఆచరించటం లేదు అని మీకు అనిపిస్తుంది. చాలామాటలు చెపుతున్నాము. అందులో అసలు మనకు అనుభవం ఏముంది? ఒక్కటైనా ప్రాక్టీసు చేస్తున్నామా? అసలు ప్రయత్నం చేస్తున్నామా? పోనీ నడుస్తూ ఉంటే పడిపోయినా అసలు నడవటానికి ప్రయత్నం చేస్తున్నామా? అని చెప్పగా చెప్పగా కొంత ఆలోచన మీకు వస్తుంది, అసలు రాకుండా ఉండదు. ఇతరులకు ఇన్ని విషయాలు చెప్పేటప్పుడు మనం కూడా కొంత ప్రాక్టీసు చెయ్యాలికదా అనే బుద్ధి మీకు వెంటనే కాకపోయినా నెమ్మదిగా కలుగుతుంది, మీకు కొంత లాభం వస్తుంది. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు గ్రంథపఠనం వలన జ్ఞానం కలుగదు, అందులో సందేహం లేదు. నువ్వు చదువుకోవాలంటే చదువుకో. నువ్వు అనేక జన్మల నుండి వాసనలు పోగుచేసుకొని వస్తున్నావు. పూర్వ దేహాలు అన్నీ కాలి బూడిద అయిపోయినాయి. అక్కడ నువ్వు సంపాదించుకొన్న వాసనలు, కోరికలు, సంస్కారాలు, అనుభవాలు ఇవన్నీ సూక్ష్మశరీరంతోటి మోసుకొనివస్తున్నావు. ఆ వాసనలు బలీయమైనవి. గురువు అనుగ్రహం లేకుండా ఒక్క వాసన కూడా విడిచిపెట్టదు. నిన్ను బంధించేవి వాసనలే కదా. మీరు చెప్పేది మాకు తెలియటంలేదు అంటారు. మేము చెప్పేది మీకు తెలియటానికి మీ వాసన తెలియనిస్తుందా? ఇలా చెప్పేవాడు గురువు కాకపోతే

మీకు ఎవడు ఉన్నాడు. అసలు మనకు గురువుకి మించిన బంధువు ఉన్నాడా? ఈ బంధువులు ఎవరూ మనకు ఉపకారం చేయనక్కరలేదు అపకారం చెయ్యకుండా ఉంటే వాళ్ళందరూ మన బంధువులే. చుట్టాలు, చుట్టాలు అంటారు ఏ చుట్టం మీకు ఏమీ చెయ్యడు. మీరు కనిపెట్టుకొని ఉండకండి. ఒక విషయం మీకు అర్థమవ్వటంలేదు. అసూయ అనేది ముందు చుట్టాలతోనే ప్రారంభమవుతుంది. మీరు సత్యాన్వేషకులైతే ముందు విరోధులు మీ ఇంట్లోనే బయలుదేరతారు.

వాసనలు చాలా బలీయమైనవి. నువ్వు పుస్తకాలు చదివినా పూర్వజన్మలనుండి వచ్చే వాసనలు, సంస్కారాలు నీకు జ్ఞానం కలగటానికి నిన్ను తొందరగా ఎలౌ చెయ్యవు. నువ్వు పూర్వజన్మలనుండి మోసుకొనివస్తున్న వాసనలు పూర్తిగా క్షయం అయ్యేవరకు లోపల ఉన్న సత్యం తాలుక అనుభూతి అసలు నీకు సాధ్యమేకాదు. శరీరాన్ని చంపేయటానికి ఒక్క జబ్బు చాలు అలాగే మీకు జ్ఞానం రాకుండా ఆపుచేయటానికి ఒక్క వాసన చాలు. మనిషి పాడైపోవటానికి ఒక్క పేకాట చాలు. అలవాట్లు లేనివారికి ఇంట్లో ఎక్కడ చూసినా డబ్బే. మీరు ఎక్కడికి వెళ్ళరు, సిగరెట్లు కాల్చరు, సారా తాగరు, ఏ చెడ్డ అలవాట్లు లేవు అనుకోండి ఇంక మీకు తిండికి బట్టకు ఎంత ఖర్చు అవుతుంది. 500 రు॥ కూలీ తెచ్చుకొని 300 రూ॥ సారా తాగేస్తూ ఉంటే ఇంక ఎవడు బాగుచేయగలడు. జీతం ఎక్కువా, తక్కువా అని కాదు. తక్కువ జీతం వచ్చినా చెడు అలవాట్లు లేకపోతే మీకు డబ్బు నిలువ ఉంటుంది. నీకు జ్ఞానం రాకపోవటానికి, నువ్వు పాడైపోవటానికి, నీ దగ్గర ఉన్న డబ్బు ఖర్చు అయిపోవటానికి నీ అలవాట్లే కారణం. ఎవరిమీద నెపాలు వెయ్యకు. నువ్వు బాగుపడటానికి ప్రయత్నం చేయటం మానేసి ఎదుటివారిమీద నెపాలు వేసి ఎంతకాలం కాలక్షేపం చేస్తావు. ఆధ్యాత్మికంగానేకాదు, భౌతికంగాకూడా నువ్వు పాడైపోవటానికి మీకు పూర్వజన్మల నుండి వచ్చిన గుణాలు, అలవాట్లే కారణం. మీ అంతట మీరు దరిద్రులు అయిపోతూ ఉంటే ఎవరు వచ్చి మిమ్మల్ని ఉద్ధరిస్తారు, ఏ ప్రభుత్వం మీకు సహకారం చేస్తుంది. మీకు బాగుపడాలని ఉంటే ఎవరైనా వచ్చి మీకు సహకరిస్తారు. అసలు మీకు బాగుపడాలని లేనప్పుడు ఎవరు సహకరిస్తారు. నీ అలవాట్లయొక్క వేగం నీకు తెలుస్తోందా? నీ అలవాట్ల వేగంలో నీ రూపాయలు కాల్చేసుకొంటున్నావు ఇంక ఎవరిని నిందిస్తావు?

మీరు శాస్త్రాలు, గ్రంథాలు బాగా చదువుతున్నారు. పాండిత్యం సంపాదించుకొంటున్నారు. నేను పండితుడిని, నేను పండితుడిని అనుకొంటే ఈ పాండిత్యం కూడా వాసనే. ఈ పాండిత్యం అంతా ఇతరులకు చెప్పటానికా, నువ్వు బాగుపడటానికా. అసలు పాండిత్యం నేర్చుకొనేటప్పడే ఏదో పాఠాలు చెప్పటానికి నేర్చుకొంటున్నావా, నిన్ను నీవు

బాగుచేసుకోవటానికి నేర్చుకొంటున్నావా, ఫండమెంటల్ ప్రశ్న ఇది, ఈ ప్రశ్న మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఇదంతా ఇతరులకోసమా, నీ బాగు కోసమా. ఇవన్నీ ఇతరులకు బోధించటానికా లేక నిన్ను నీవు పవిత్రం చేసుకోవటానికా ఈ పాండిత్యాలు. నిన్ను నువ్వు చంపుకోవటానికి గుండుసూది సరిపోతుంది కదా! కత్తులు కఠారులు, గెడ్డపారలు కావాలా అన్నాడు రామకృష్ణుడు. నిన్ను నీవు చంపుకోవటానికి గుండుసూది సరిపోతుందికదా, గెడ్డపార లేకపోతే నిన్ను చంపుకోలేవా? ఇతరులను చంపటానికి కత్తులు, కఠారులు కావాలి. ఈ పాండిత్యం లేకపోతే నువ్వు బాగుపడలేవా? నువ్వు పాండిత్యం సంపాదించాలి అంటే సంపాదించుకో, అది కూడా ఒక వాసనే.

మౌనం అంటే ఏమిటి? నోరుమూసుకొని కూర్చోవటం మౌనం కాదు, మనస్సు మూతపడాలి. మనస్సు మూతపడితే అప్పుడు మీకు మాటలు అక్కరలేదు. ఎప్పుడైతే మనస్సు పల్చబడి చిరిగిపోయిందో అక్కడ నుండి గొప్ప సందేశం ప్రారంభమవుతుంది. వాడికి మాటలతో పనిలేదు. హృదయం హృదయంతో మాట్లాడేటప్పడు మాటలు ఎందుకు? కడుపులో లేనిది కడుపు చింపుకొంటే వస్తుందా? ఎందుకు ఈ బొబ్బలు. పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు అన్నీ ఎక్కడ గూడుకట్టుకొని ఉన్నాయో, ఆ మనస్సు కాలిబూడిద అయిపోయినప్పడు మనస్సులో ఉన్న గుణాలు కూడా కాలిపోతాయి. అప్పడు వచ్చేదే మౌన భాష. ఈ వాక్కుతో వచ్చే భాషకంటే మనస్సు చిరిగిపోయిన మౌనంలోనుండి వచ్చే భాష వలన మీరు తొందరగా బాగుపడతారు. మీరు బాగుపడాలి అని నోటితో చెప్పటంకాదు అది మౌనంలోనుండి కనుక వస్తే మీరు తొందరగా మారుమనస్సు పొందుతారు, అప్పడు మా ప్రసంగాలు అనవసరం. మౌనానికి ఉన్న శక్తి తలంపుకి లేదు. తలంపుకి ఉన్న శక్తి మాటకి లేదు. మీరు మౌనం గురించి మాట్లాడుతున్నారు, నా అవగాహనకు అందటం లేదు అంటున్నాడు. మౌనం మాటకు అందదు, సంకల్పానికి అందదు, మనస్సుకు అందదు. సైలెన్స్‌లో దేవుడు లేడు, సైలెన్స్‌లో సృష్టిలేదు, సైలెన్స్‌లో ఇతరులు లేరు, సైలెన్స్‌లో చావు లేదు, పుట్టుకలేదు, సైలెన్స్‌లో నేను మాట్లాడటానికి మీరు కూడా ఎవరూ లేరు, గొప్ప గొప్ప సైంటిఫిక్ ఎచీవ్‌మెంట్స్ ఇవన్నీ కూడా సైలెన్స్‌లో నుండే వస్తాయి. జీవితంలో ఆ సైలెన్స్ అలవాటు పడిన వారు మాత్రమే మాధుర్యం కల్పించుకుంటారు. నిజమైన ఆప్యాయత, ట్రూ లవ్ కూడా సైలెన్స్‌లో నుండే ప్రవహిస్తుంది. సైలెన్స్‌లో మాట్లాడటానికి ఎవరూ ఉండరు, అసలు ఇతరులు ఉంటే కదా మాట్లాడటానికి. అంటే మన జీవితంలో కనీసం కొన్ని క్షణాలు అయినా మనం సైలెన్స్‌ను అనుభవించలేదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడని గుర్తుపెట్టుకోండి. ఇంక మీరు ఏమీ చేయనక్కరలేదు, పరమాత్మ అనేవాడు ఒకడు ఉన్నాడు అని గుర్తు పెట్టుకోండి. మీరు ఎవరికీ భయపడకండి, మీరు ఎవరినీ భయపెట్టకండి.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# అమృతమూర్తి

అనాదిగా ఎందరో మహాత్ములు తమ అమృతబోధను మానవాళికి అందించి, ఉద్ధరించి, స్వరూప అమృతస్థితిలోకి మేల్కొలుపుటకోసం, శరీరాన్ని ధరించి ఈ భూమిపై అవతరిస్తూనే ఉన్నారు. భౌతికంగా వారు మన మధ్య లేకపోయినా వారి చైతన్యశక్తి అందరిని ప్రభావితం చేస్తూ నిరంతరం కాపాడుతూనే ఉంటుంది. అట్టి మహాత్ముడే ది॥ 30-12-1879 నుండి 15-04-1950 వరకు జీవించిన అరుణాచల ఋషి భగవాన్ శ్రీరమణమహర్షి. భగవాన్ శ్రీరమణమహర్షి చేసిన తత్త్వబోధ దేశకాలాతీతమైన సత్యబోధ. వారి ప్రతి వాక్కులోనూ సర్వకాలీన సత్యాలు మనకు గోచరిస్తాయి. అమూల్యమైన వారి పలుకులు సత్యాన్వేషకులకు కరదీపాలవంటివి. శ్రీరమణబోధను అర్థం చేసుకొని, ఆచరించడం వల్ల, మనలోని భ్రాంతి రూపమైన అజ్ఞానం నశిస్తుంది. భగవాన్ జీవితము వారి బోధ వేరు కాదు. ఆయన ఆచరించే బోధించారు, బోధించినదే ఆచరించారు. అద్వైత నిష్ఠలోనూ, సమత్వంలోనూ, ఆయనకు ఆయనే సాటి. ముముక్షువుల మనస్సును అంతర్ముఖపరచి, మనోమూలంలోకి మేల్కొలుపుటయే గమ్యంగా వారి మాట, చేత, ప్రవర్తన, బోధ, అన్నీ సాగాయి. భగవాన్ శ్రీరమణుల గురించి మనం తెలుసుకోవాలంటే ఆయన మనకు ఎరుక పరచవలసిందే! భగవాన్ బోధను ఆచరిస్తే దుఃఖాన్ని అతిక్రమించ గలుగుతాము. భగవాన్ శ్రీరమణుల నిర్మలప్రేమ, అపారకరుణ, జ్ఞానబోధ, ప్రపంచం నలుమూలల నుండి జిజ్ఞాసువులను ఆకర్షించింది. సమత్వం, ప్రేమ, కరుణ, దయ, అనే సూత్రాలపై ఆధారపడినదే శ్రీరమణ సిద్ధాంతం. "నీవు ఏ సత్యాన్ని అయితే తెలుసుకోవాలను కుంటున్నావో అది నీవై ఉన్నావు. సత్యము నీ స్వరూపంగానే ఉంది. కావున వ్యక్తి భావనను అతిక్రమించి, వాస్తవంగా నీవెవరివో? అనుభవైకవేద్యం చేసుకో!" అన్నదే వారి బోధాసారము. భగవాన్ శ్రీరమణమహర్షి శరీరధారియై ఉన్న కాలంలో సుమారు ఏబది నాలుగు సంవత్సరములు అరుణాచల క్షేత్రం కేంద్రంగా, వారు చేసిన జ్ఞానబోధ అద్వితీయం, అపూర్వం, జిజ్ఞాసువులకు వరప్రసాదం.

**(ది॥ 27-12-2015 శ్రీరమణ జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# భక్తుడు గురుచరణాలకు చిక్కుతాడు

పాదము అంటే మూలము. అనంతకోటి జన్మల కర్మ భారంతో కుళ్లి కృసించే సాధకుడు దారికానరాక సంకట స్థితిలో పరమాత్మ రూపంలో దాగి ఉన్న గురుచరణాలను పట్టుకొని మీరే దిక్కు అని ఆర్తితో అలమటిస్తాడు. ఆతడు ఎంత పాపియైనా సద్గురువు ఆతని కర్మల భారాన్ని నెత్తినవేసుకొని శిష్యునికి ఉపశమన మార్గాన్ని బోధించి సమాధానపరుస్తాడు. ఈ క్రియలో ఆయన తప్పకోలేరు. అది దైవీ కరుణ. పాపం తపస్సును చెయ్యనివ్వదు. తపస్సు చేస్తే గాని పాపంపోదు. ఇది ఒక విషవలయం. గురు పాదాలయందు ప్రీతిపెంచుకుంటే దారి దొరుకుతుంది. గురుగీత "నీకు ఎంత యశస్సు ఉన్నా ఎంత పాండిత్యం ఉన్నా ఎంత సంపద ఉన్నా గురు చరణాలమీద దృష్టి నిలపకపోతే ఏమిటి ప్రయోజనం? ఏమిటి ప్రయోజనం?" అంటుంది. కబీర్ "నవ్వుతూ, నవ్వుతూ నాధుణ్ణి చేరలేరు. చేరినా వారు అంతా గురుపాదాలను బట్టి ఏడ్చినవారే. ఆటలతో నవ్వులతో పరమాత్మ చిక్కితే ఇక అభాగ్యులు ఎవరు?" అన్నారు. గురువును మనం తలచుకొంటూ ఉంటే మనలను ఆయన తలుస్తూ ఉంటారు ఇది మనకు తెలియాలి. గురువు నన్ను రక్షిస్తున్నాడు అనే విశ్వాసం సదా ఉండాలి. హృదయం ఎంత రగులుతున్నా శ్వాస పోతున్నా విశ్వాసం సడలకూడదు. ఈ రోజు ఆయన్ని తలవక రేపు తలచుకొందాము అని ఉపేక్షిస్తే తీతువుపిట్టను గెద్ద తన్నుకునిపోయినట్లు కాలం మనలను ఉన్నట్లు ఉండి చంపుతుంది. మన జీవితం మొత్తానికి మొత్తం పనికిమాలింది. మనం గురువును ఆరాధించి, గౌరవించి శరణాగతుడైనందువల్ల జీవితాన్ని గెలుస్తాము. మన హృదయం గురు ప్రార్థనతో నిండిపోవాలి. గురుదృష్టిలో మన దుర్బలమైన, దిక్కుమాలినదైన అహంకారం గురుచరణాలు పట్టుకొంటే శక్తిహీనమైపోతుంది. దానికి ఉదాహరణ మార్కండేయుడే. మన కుయుక్తులతో, కుతంత్రాలతో ఎన్నో జన్మల నుంచి మన అహంకారానికి మనమే శక్తినిచ్చాము. వాటి అనుభవాలను ఎదుర్కొనలేక ఈ మన ఈ పెద్ద సామ్రాజ్యాన్ని గురుచరణాలపై పెట్టి దాన్ని వశం చేసుకోండి. అరిషడ్వర్గాలనే శత్రువుతో రాజులను ఏగలేను అని ప్రార్థిస్తాము. గురువు దానికి "మంచిదే" అంటారు. మన బుద్ధి తక్కువ తనాన్ని వదిలింపచెయ్యటానికి ఒప్పకొంటాడు. ఆయన దృష్టిలో మనకు ఏ సామ్రాజ్యం లేదు. అందువల్ల ఆయనకు ఏ సమస్య తెచ్చిపెట్టదు. గురువు ముందు మనం గడ్డిపరక లాంటివాళ్ళము. మనం నకిలీ వస్తువులనే సమర్పించుకొంటాము. వాస్తవమైనది ఏదీ సమర్పించుకోవటంలేదు. ఒకవేళ అదే నిజమైతే ఎందరో శిష్యుల అహంకార భారంతో గురువు భారమై, అలసిపోతారు. బ్లాక్‌బోర్డుమీద అక్షరాలను డస్టరుతో తుడిచేసినట్లు మన చిత్రవిచిత్రమైన అనంతకోటి అహంకారగాథలు ఒక్క కంటిచూపుతో తుడిచి శూన్యం చేస్తాడు మన గురువు. శ్రీ నాన్నగారు "ఈ లోపులో జపధ్యానాలతో చేతులు ఊపుతూ ఉండండి. మీరు పచ్చి వగరు, చేదును చప్పరించి, తీపిగా మారేకాలం కోసం ఎదురుచూచి మీ అహంకారాన్ని గుటుక్కున మింగేసి తన ఆనంద స్వరూపాన్ని మీకు ఇస్తాడు" అన్నారు. అప్పుడు మన అహంకారం కథ కంచికి వెళ్లిపోతుంది. మన స్వగృహంలోకి ప్రవేశించి ఆనందిస్తాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**